ఆ విధానమే మేలు

- గత ప్రభుత్వంలో భూముల రీసర్వే ద్వారా శాశ్వత భూహక్కు
- దీనినే నేడూ అమలు చేసే యోజన
- రెవెన్యూ సదస్సుల్లో 500 వినతుల స్వీకరణ
- గతంలో సర్వేకు హాజరుకాకపోవడంతోనే సమస్యలు

నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భూముల రీసర్వేను చేపట్టింది. దీని ద్వారా శాశ్వత హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంది. అయితే దీనిని నిలిపివేస్తామని కూటమి పెద్దలు అప్పట్లో ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చాక తమ విధానాన్ని మార్చుకుని రీసర్వేను కొనసాగించేందుకు సమయాత్తమయ్యారు.



ఊసపల్లిలో హద్దురాళ్లు నాటుతున్న ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

పొదలకూరు: వందేళ్ల తర్వాత దేశంలోనే తొలిసారిగా గత ప్రభుత్వంలో సమగ్ర భూముల సర్వే జరిగింది. మండలంలో ఉన్న 54 గ్రామాల్లో 24 గ్రామాల్లో సర్వేను పూర్తి చేశారు. ఇందుకోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి విజయవంతంగా నిర్వహించారు. డ్రోన్లతో గ్రామాల్లో ముందుగా మ్యాపింగ్ చేయించి తర్వాత సర్వేను ప్రారంభించారు. ఆ సమయంలో గ్రామాలకు తరచూ జేసీ, ఆర్డీఓలు విచ్చేసి పరిశీలించారు. పూర్తయిన కొన్ని గ్రామాల్లో భూహక్కు పత్రాలను కూడా అందజేశారు. తొలిసారిగా ఊట్లపాళెం గ్రామంలో భూహక్కు పత్రాలను (పట్టాదార్ పాస్‌పుస్తకాలు) పంపిణీ చేశారు. పొరపాట్లు ఉంటే సరిదిద్దేందుకు సంబంధిత రైతులకు అవకాశం ఇచ్చారు.

ప్రతి కమతానికి ఐడీ నంబర్

భూముల వ్యవహారాల్లోనే అధికంగా న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నందున రైతులకు సంబంధించిన భూ హద్దులు, దారి గొడవలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్షాంశ, రేఖాంశ ఆధారంగా ఆధునాతన టెక్నాలజీతో మార్కింగ్ ఇచ్చి ప్రతి కమతానికి గుర్తింపు నంబర్ ఇచ్చారు. అయా గ్రామాల్లో సర్వే నంబర్ 1 నుంచి కొత్తగా ఇస్తూ ప్రక్రియ పూర్తయ్యాక సభలు నిర్వహించి పాస్ పుస్తకాలను అందజేశారు. కాగా తొలివిడతలో సర్వే చేసిన మొగళ్లూరు గ్రామంలో సమస్యలు నెలకొనడంతో అక్కడి రైతులు పాస్ పుస్తకాలు తీసుకోలేదు. పల్లెల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భూముల తోపాటు, గ్రామకంఠం భూములను కూడా సర్వే చేయించారు. మొగళ్లూరు, నందివాయ, అంకుపల్లి, బత్తులపల్లిపాడు, చాటగొట్ల, గురవాయపాళెం, ఊట్లపాళెం, ఊసపల్లి, మర్రిపల్లి, పార్లపల్లి, వెలికంటిపాళెం, మరుపూరు, డేగపూడిరాజుపాళెం, నల్లపాళెం, మహ్మదాపురం, తాటిపర్తి, బిరదవోలు, కనుపర్తి, ఆర్‌వైపాళెం, డేగపూడి, ఇనుకుర్తి, పొదలకూరు, సూరాయపాళెంలో రీసర్వే జరిగింది. గ్రామహద్దులతోపాటు ప్రభుత్వ భూముల సర్వే, గ్రౌండ్ ట్రూత్‌నింగ్ (రైతును పక్కన పెట్టుకుని సర్వే నిర్వహించడం) చేశారు.

సర్వే కొనసాగింపు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేను నిలిపివేస్తామని కూటమి పెద్దలు అప్పట్లో హంగామా చేశారు. అయితే అధికారంలోకి వచ్చాక రీసర్వే కొనసాగించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం ఉండడంతో మిగిలిపోయిన గ్రామాల్లో సర్వేను చేపట్టి పూర్తి చేస్తామని ఇటీవల జేసీ కూడా ప్రకటించారు. ఈ ప్రక్రియ జరిగితేనే భూముల హద్దులు తెలుస్తాయనే అభిప్రాయంలో రైతులున్నారు. ఇటీవల ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించింది. మొత్తం 24 గ్రామాల నుంచి 500 వినతులు అందాయి. వాటిలో 50 శాతం అర్జీలు పేర్ల తప్పొప్పులపై వచ్చినట్టుగా అధికారులు వెల్లడించారు. భూముల కొలతల్లో తేడాలున్నాయని, హద్దుల వివాదం తదితర అంశాలపై మిగిలిన వినతులు వచ్చాయి. అయితే సర్వే సమయంలో సంబంధిత రైతులు, పక్క పొలాల రైతులు హాజరు కాకపోవడంతోనే సమస్యలు నెలకొన్నట్టుగా అధికారులు గుర్తించారు.

హద్దులు తెలిశాయి



రీసర్వే వల్ల భూముల హద్దులు తెలిశాయి. దశాబ్దాలుగా భూముల సర్వే చేయకపోవడంతో కొందరు రైతులు హద్దులు తెలియక తమ భూములను కోల్పోయారు. రీసర్వే తర్వాత కచ్చితమైన హద్దులు ఏర్పడ్డాయి.

–వి.చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, మరుపూరు

ఎంతో ఉపయోగం



భూముల రీసర్వే వల్ల రైతులకు ఎంతో ఉపయోగం జరిగింది. సాదాబైనామా భూములకు కూడా పరిష్కారం లభిస్తుంది. ఎన్నో ఏళ్లుగా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న భూములకు శాశ్వత భూహక్కు వర్తిస్తుంది. లోటుపాట్లు ఉంటే అప్పీల్ చేసుకునే అవకాశం కూడా ఉంది.

– కె.కోటేశ్వరరావు, రైతు, ఊసపల్లి

వినతులు అందాయి

రీసర్వే జరిగిన గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 500 అర్జీలు అందాయి. పేర్లకు సంబంధించిన సమస్యలపైనే అధికంగా వచ్చాయి. మిగిలినవి భూములు తగ్గాయని, హద్దులు సక్రమంగా లేవని అర్జీలు వచ్చాయి. అన్ని సమస్యలను పరిష్కరిస్తాం. త్వరలో తిరిగి రీసర్వే చేపట్టడం జరుగుతుంది.

– శివకృష్ణ, తహసీల్దార్, పొదలకూరు

క్లుప్తంగా

రోగులకు అండగా..



కోవూరు : అవాజ్ (మైనారిటీ డెవలప్‌మెంట్ ఫోరమ్) ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. అనంతరం ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్.రషీద్ మాట్లాడుతూ మైనారిటీల సమస్యల పరిష్కారానికి ఆవాజ్ పనిచేస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇమామ్, మౌజన్‌లకు ఆరు నెలలుగా గౌరవ వేతనాలు ఇవ్వడం లేదని, మైనారిటీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఆవాజ్ నేతలు షేక్.చాన్‌బాషా, సయ్యద్ సర్దార్ అహ్మద్, అఫ్రోజ్, బాబు, హుమయూన్, మాబాషా, ఫాతిమా, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి గండవరపు శేషయ్య, బుజ్జయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకట చలపతిగౌడ్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి అభిషేకం



పొదలకూరు: స్వాతి నక్షత్రం సందర్భంగా పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం నరసింహ స్వామికి అభిషేకం నిర్వహించారు. ఉభయకర్తలుగా శ్రీనివాసులు – రజినీ దంపతులు వ్యవహరించారు.

మెప్మా మార్కెట్ పరిశీలన



అర్బన్ మార్కెట్‌లో బ్యాగ్‌ను కొనుగోలు చేస్తున్న చైర్‌పర్సన్

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కులో పొదుపు మహిళలు నిర్వహించిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను నగరపాలక చైర్ పర్సన్ మోర్ల సుప్రజ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలిపారు. వినూత్న ఆలోచనలతో వివిధ రకాల గృహ అవసరమైన ఉత్పత్తులను ప్రజలు కొనుగోలు చేసి వారి ఆర్థిక అభ్యున్నతికి సహకరించాలని కోరారు. స్టాల్స్‌లో ప్రతిఒక్కరి ఇంటికి అవసరమైన ఉత్పత్తులు తక్కువ ధరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పుట్టా లక్ష్మీకాంతమ్మ, తాళ్ల వైష్ణవి, బిట్రగుంట ప్రమీలమ్మ, పొదుపు సీట నర్మదా, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ షాపులో చోరీ

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లిలోని కూల్‌డ్రింక్ షాపులో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు, షాపు యజమాని షేక్ కాలేషా తెలిపిన వివరాల మేరకు.. కాలేషా రోజూలాగే గురువారం రాత్రి కూల్‌డ్రింక్ షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం షాపు తెరిచేందుకు వచ్చి చూడగా షట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. షాపులోని సుమారు రూ.15 వేల విలువైన నగదు, ఇతర సామగ్రిని కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు చేజర్ల ఎస్సై తిరుమలేశ్వరరావు షాపు వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చేజర్ల: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ పీడీ బి.హేనాసుజన్ పేర్కొన్నారు. ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మహిళా సాధికారత, బాలల అభివృద్ధిపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేసుకోవాలని బాలికలకు సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, రక్తహీనతతో తలెత్తే సమస్యలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు నిర్దేశించిన 1098, 181, 112 నంబర్లపై అవగాహన కల్పించారు. గురుకులం ప్రిన్సిపల్ శైలజకుమారి, వైస్‌ప్రిన్సిపల్ నాగలలిత, పి.గజలక్ష్మి, సఖి వన్ సెంటర్ సిబ్బంది ఎస్ ప్రశాంతి, టీ కమల, సాధన, ఐసీడీఎస్ సీడీపీఓ పీ సునీలత, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక క్యాంప్



మాట్లాడుతున్న ఎంపీడీఓ

మనుబోలు: దివ్యాంగులు, వయో వృద్ధుల కోసం డిసెంబర్ 2వ తేదీన మండలంలో ప్రత్యేక క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జలజాక్షి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ క్యాంప్‌లో వారికి ప్రత్యేక అవసరాలు ఉన్నాయా అని తెలుసుకుంటారని వెల్లడించారు. ట్రై సైకిళ్లు, వీల్‌చైర్స్, వినికిడి యంత్రాలు, కళ్లద్దాలు తదితరాలు అవసరమైతే పేర్లు నమోదు చేసుకుంటారన్నారు. ఇందుకోసం దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, వయో వృద్ధులు ఆధార్, రేషన్‌కార్డుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తెచ్చుకోవాలని సూచించారు.

అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదాలు



పొదలకూరు: కార్తీక మాసం సందర్భంగా మండలంలోని అరుంధతీయ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో శుక్రవారం అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అరుంధతీయ సేవా సంఘం సభ్యులు శ్రీనివాసులు, ప్రసాద్, పెంచలయ్య, ఎం.పెంచలయ్య, అయ్యప్ప సేవా సమాజం బాధ్యులు శివాడ పరంధామిరెడ్డి, చొప్పా వెంకటేశ్వర్లు, అడపాల మస్తాన్‌రెడ్డి, రవి, ఇండ్ల రవి, మహేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



విడవలూరు: సైబర్ నేరాలపై స్థానిక పీఆర్‌ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి.సుజాత పలు సూచనలు చేశారు. సోషల్ మీడియాపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నేటి యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ అధ్యాపకురాలు విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

ఫీడర్ బ్రేకర్ ఏర్పాటు



ఫీడర్ బ్రేకర్‌ను ఏర్పాటు చేస్తున్న అధికారులు

కోవూరు: ఇనమడుగు సబ్‌స్టేషన్‌లో జమ్మిపాళెం ఫీడర్ బ్రేకర్ గత సంవత్సర కాలంగా పనిచేయడం లేదు. దీనిపై ఫిర్యాదులు రావడంతో దాని స్థానంలో నూతన ఫీడర్ బ్రేకర్‌ను ఏర్పాటు చేశామని విద్యుత్ శాఖ కోవూరు డీఈ పవన్ కుమార్ శుక్రవారం తెలిపారు. దీని వ్యయం సుమారు రూ.3 లక్షలు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో డీఈఈ మధుసుదన్‌రెడ్డి, ప్రొటెక్షన్ ఏఈ సుబ్రహ్మణ్యం, ఏఈ రమేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. వీరభద్రస్వామి కల్యాణం



మనుబోలు: కార్తీక మాసం మాస శివరాత్రిని పురస్కరించుకుని మనుబోలు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వీరభద్రస్వామి దేవస్థానం వద్ద వీరభద్ర స్వామి – భద్రకాళి కల్యాణోత్సవాన్ని శుక్రవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వివిధ రకాల పుష్పాలతో కల్యాణ మండపాన్ని తీర్చిదిద్దారు. అర్చకులు శ్రీనివాసులు ఉదయం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో విచ్చేసి తిలకించారు. అన్నప్రసాద వితరణ చేశారు. నెల్లూరుకు చెందిన బాగవతుల విజయరాఘవేంద్ర – శైలజ, విజయ కృష్ణ, విరంజని, శ్రవణ్‌కుమార్, అనూష ఉభయకర్తలుగా వ్యవహరించారు.



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

సీతారామపురం: మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని కావలి డీఎస్పీ శ్రీధర్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం సీతారామపురం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణ, గంజాయి, ఇసుక అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, నాటుసారా తదితర వాటిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఉదయగిరి సీఐ వెంకటరమణ, ఎస్సై శివకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

పొదలకూరు: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై ఇటీవల ప్రభుత్వం నుంచి పురస్కారం అందుకున్న పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ఏవీ సుధాకర్‌ను శుక్రవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సన్మానించారు. నెల్లూరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మస్తాన్‌బాబు, బోగోలు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మనుబోలు: మండల పరిధిలోని హైవే పక్కనున్న పాత పామాయిల్ ఫ్యాక్టరీ వెనక వైపు నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై శివరాకేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,900 నగదు స్వాధీనం చేసుకున్నారు.

శివునికి అన్నాభిషేకం



బుచ్చిరెడ్డిపాళెం: కార్తీక మాసం సందర్భంగా స్థానిక సాయి మందిరంలో శుక్రవారం శివలింగానికి భక్తులు అన్నాభిషేకం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాలు జరిపారు.

వ్యక్తి అదృశ్యం



చంద్రయ్య

ముత్తుకూరు: భార్యతో విభేదాల కారణంగా ఓ వ్యక్తి అలిగి ఇంటి నుంచి పారిపోయిన ఘటన మండలంలో జరిగింది. కృష్ణపట్నం ఎస్సై శ్రీనివాసరెడ్డి కథనం మేరకు.. గోపాలపురానికి చెందిన కత్తి చంద్రయ్య ఇటీవల భార్య ప్రసన్నతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ప్రసన్న శుక్రవారం కృష్ణపట్నం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



విడవలూరు : క్షేత్ర సందర్శన చేస్తున్న అధికారులు



కోవూరు : మాట్లాడుతున్న ఏడీ సుజాత

విడవలూరు: రైతులు తమ పొలాన్ని తప్పకుండా ఈ–క్రాప్ చేయించాలని మండల ఏఓ పి.వెంకటకృష్ణయ్య అన్నారు. మండలంలోని పలు గ్రామాలను వీఏఏలతో కలిసి ఆమె శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వ పథకాలతో పాటు సబ్సిడీ కోసం ఈ–క్రాప్ చేయించుకోవాలని తెలిపారు. అధికారులు సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని వీఏఏలతో పాటు రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కోవూరు : రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీ సుజాత అన్నారు. మండలంలోని లేగుంటపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. కౌలు రైతులు సీసీఆర్ కార్డులు పొందాలని సూచించారు. ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు. ఆమె వెంట ఏఓ ఇందిరావతి తదితరులు ఉన్నారు.


జాగ్రత్తగా లేకుంటే అంతే..



చిన్నచెరుకూరు - కాకుపల్లి మార్గంలో..

తోటపల్లిగూడూరు: మండలంలోని చిన్నచెరుకూరు – కాకుపల్లి మార్గాల మధ్య ఉన్న రెండు వంతెన ప్రమాదాలకు కేంద్రంగా మారాయి. కండ్రిగమాన్యం సమీపంలో ఉన్న మలుపు వద్ద ఇవి ఉన్నాయి. ఇరుకైన వంతెన ఒకటి, రక్షణ గోడలు లేని మరో వంతెన వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దగ్గరకు వచ్చేంత వరకు ఇవి వాహనాదారులకు కనిపించవు. హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ వంతెనలను వెడల్పు చేయడంతోపాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంది.

ఎగసిపడుతున్న అలలు



ఫెంగల్ నేపథ్యంలో బంగాళాఖాతంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. దీనికితోడు తీరంలో చలిగాలులు వీస్తున్నాయి. మండలంలో వాతావరణం చల్లబడి శుక్రవారం మోస్తరు జల్లులు కురిశాయి. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు.

– ఇందుకూరుపేట

7న మెగా పేరెంట్స్ మీటింగ్



కొడవలూరు : సూచనలిస్తున్న సత్యవాణి

కొడవలూరు : వచ్చే నెల 7వ తేదీ మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ జరుగనుందని, దీనిని పండగ వాతావరణంలో నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారిని పి.సత్యవాణి సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న లెండి డిగ్రీ కళాశాలలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో ఎంపీటీ మీటింగ్ ఏర్పాట్లపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీటీ మీటింగ్ విజయవంతానికి హెచ్‌ఎంలే కాకుండా ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. సమావేశానికి హాజరైన తల్లిదండ్రులందరికీ భోజన వసతి విధిగా కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ జి.వసంతకుమారి, గండవరం హైస్కూల్ హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- **ముత్తుకూరు:** మండలంలోని ముత్తుకూరు ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో డిసెంబర్ 7వ తేదీన మెగా పేరెంట్స్ మీటింగ్ జరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు చల్లా శ్రీనివాసులురెడ్డి వెల్లడించారు. ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ ధరణిజ, ఉపాధ్యాయులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమావేశం నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించాలన్నారు.



ముత్తుకూరు: ఏర్పాట్లపై చర్చిస్తున్న హెచ్‌ఎం

తల్లిదండ్రులకు భరోసా ఇవ్వండి

బుచ్చిరెడ్డిపాళెం: పాఠశాలల పట్ల పిల్లలు, తల్లిదండ్రులకు నమ్మకం పెంచడానికి డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ ఎం.శ్రీహరి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్‌లో తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలన్నారు. పిల్లల ప్రగతిపై చర్చ జరగాలని, పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పీవీ.రత్నం, మెప్మా ఏఓ సుధాకర్‌రావు, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యుడు గండికోట సుధీర్ కుమార్ పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం : మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి